సాక్షి నిర్మల్

మంగళవారం ၊ 10 ၊ సెప్టెంబర్ ၊ 2024

రాష్ట్రస్థాయి ప్రజావాణి వాయిదా

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్రస్థాయిలో మహాత్మ జ్యోతిబాపూలే ప్రజాభవన్, బేగంపేట, హైదరాబాద్‌లో నిర్వహించే ప్రజావాణి 16వ కేంద్ర ఆర్థిక సంఘం సమావేశాల కారణంగా మంగళవారం రద్దుచేసి ఈ నెల 11న బుధవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులందరూ ఈ మార్పును గమనించాలని ఆమె కోరారు.

మద్యం దుకాణాలు బంద్

నిర్మల్‌చైన్‌గేట్: వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకుని జిల్లాలో మద్యం షాపులు తెరవరాదని కలెక్టర్ అభిలాష అభినవ్ కోరారు. ముధోల్‌లో 12న సాయంత్రం 6 నుంచి 14న ఉదయం 10 వరకు, భైంసాలో 14న సాయంత్రం 6 నుంచి 16న ఉదయం 6 వరకు, నిర్మల్‌లో 17న ఉదయం 9నుంచి 19న ఉదయం 6 గంటల వరకు మద్యం దుకాణాలు మూసివేయాలని సూచించారు.

గరిష్ఠం/కనిష్ఠం
27.0 /24.0

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. రుతుపవనాల ప్రభావంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

తెలంగాణ ఉద్యమంలో కాళోజీ కృషి మరువలేనిది



నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ ఉద్యమంలో ప్రజాకవి కాళోజీ చేసిన కృషి మరువలేనిదని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కాళోజీ నారాయణరావు 110వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన రచనలు, సాహిత్యం ద్వారా తెలంగాణ ప్రజానీకానికి ఉద్యమ పాఠాలు నేర్పిన గొప్ప వ్యక్తి అన్నారు. ఆయన జయంతిని ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపు కోవడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో రాజేందర్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అధికారి రాజేశ్వర్ గౌడ్, జిల్లా బీసీ సంక్షేమాధికారి శ్రీనివాస్, డీఏవో అంజిప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

శాంతికమిటీ సమావేశం




మాట్లాడుతున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్

ముధోల్: పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో శాంతికమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక నిమజ్జనోత్సవ ర్యాలీలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ మల్లేశ్, ఎస్సై సాయికిరణ్, గ్రామస్తులు, వినాయక మండపాల సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అక్రమ నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు సోమవారం కళాశాల ఎదుట రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. డిగ్రీ కళాశాల ఆవరణంలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని మండిపడ్డారు. కలెక్టర్ వచ్చి సమస్య పరి ష్కరించాలని నినాదాలు చేశారు. దీంతో రహదారిపై గంటన్నర పాటు రాకపోకలు నిలిచిపోయాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సర్ది చెప్పి రాస్తారోకోను విరమింపజేశారు.

'ఎండీఎం'ను ప్రైవేటుకు అప్పగించొద్దు



నిరసన తెలుపుతున్న ఎండీఎం కార్మికులు

నిర్మల్‌చైన్‌గేట్: సెంట్రలైజ్డ్ కిచెన్ విధానం ద్వారా పాఠశాల వంట కార్యక్రమాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించే విధానాన్ని విరమించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు భూక్యా రమేశ్ అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడిగుడ్లు, గ్యాస్, వంట సరుకులు ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. మెనూ చార్జీలు రూ.25కు పెంచాలన్నారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో అక్టోబర్ 14 నుంచి నిరవధిక సమ్మె చేపడతామన్నారు.

చిన్నారికి నంది అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న సహసిరాజ్

నిర్మల్‌టౌన్: నృత్యమాల నాట్యకళా వెల్ఫేర్ సొసైటీ, సిరి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బిర్లా భాస్కర స్టేడియంలో సోమవారం కృష్ణాష్టమి, వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. ఇందులో నిర్మల్ పట్టణానికి చెందిన చిన్నారి గోనుగొప్పుల సహసిరాజ్ ప్రదర్శించిన కూచిపూడి నృత్యం అందర్నీ ఆకట్టుకుంది. రాజ్యసభ సభ్యులు కృష్ణయ్య చేతుల మీదుగా బాలగోపాలకృష్ణ నంది అవార్డును అందుకుంది.

జ్వరాలకు కారణమెవరు?

- ఇళ్ల చుట్టూ అపరిశుభ్రత..
- డ్రెయినేజీల్లోనే చెత్త..
- దోమలను పెంచుతున్న పరిసరాలు
- పంచాయతీ, మున్సిపల్ చర్యలూ అంతంతే..
- ఎక్కడా కనిపించని ముందు జాగ్రత్తలు



జిల్లా జనరల్ ఆస్పత్రి సమీపంలో ఇళ్ల మధ్యనే ఉన్న మురుగునీటి గుంట



జిల్లా జనరల్ ఆస్పత్రిలో జ్వర బాధితులు

నిర్మల్: చికున్‌గున్యా విజృంభిస్తోంది. డెంగీ డేంజర్ బెల్స్ మోగిస్తోంది. టైఫాయిడ్, మలేరియా, వైరల్ జ్వరాలు కామన్ అయ్యాయి. జిల్లాలో ఎటుచూసినా జ్వరాలే. ప్రతీ ఇంట్లో పేషెంట్లే. జ్వరాలతో శారీరకంగా వీక్ కావడమే కాదు.. ఆర్థికంగానూ దెబ్బతినాల్సి వస్తోంది. నెల జీతమంతా ఆస్పత్రులకే పెట్టిన కుటుంబాలూ ఉన్నాయి. వానకాలమంటేనే జ్వరాల సీజన్. కానీ.. ఈ జ్వరాలు, రోగాలు ప్రబలడానికి కారణాలపై మాత్రం దృష్టిపెట్టడం లేదు. సంబంధిత శాఖలతోపాటు బాధితుల బాధ్యతారాహిత్యమే జ్వరాలను పెంచుతోంది.

కొత్తకాలనీల్లో అధ్వానం..

జిల్లా కేంద్రం జ్వరాలమయంగా మారింది. ఏకాలనీకి వెళ్లినా చికున్‌గున్యా, డెంగీ, మలేరియా బాధితులు ఉంటున్నారు. కొత్తకాలనీలు, శివారుప్రాంతాల్లో బాధితుల శాతం ఎక్కువగా ఉంది. ఇందుకు అక్కడి పరిసరాలే కారణం. మురికికూపాల మధ్యలో ఇళ్లు కట్టుకుని ఉన్నారా.. అన్నట్లు ఉన్నాయి. ప్రియదర్శినినగర్, దివ్యనగర్, శాస్త్రినగర్, శ్రీనగర్ కాలనీ, ఇంద్రానగర్, విజయనగర్, భైంసాలోని గోపాల్‌నగర్, ఎస్‌బీ.కాలనీ, ఏపీనగర్, రాహుల్‌నగర్, ఖానాపూర్ మున్సిపాలిటీ పరిధిలోనూ చాలా ఏరియాల్లో సరైన డ్రైనేజీలు లేవు. చాలాచోట్ల ఇళ్లమధ్యలోనే చెరువులను తలపించేలా మురికిగుంతలు ఉన్నాయి. జిల్లాకేంద్రంలోని శ్రీనగర్ కాలనీ వంటి కొత్త ఏరియాల్లో అడుగడుగునా మురికినీటి గుంతలే కనిపిస్తున్నాయి.



జిల్లా కేంద్రంలో ఇళ్లమధ్యలోనే నిలిచిన మురుగునీరు



జిల్లా కేంద్రంలోని డ్రెయినేజీల దుస్థితి

పరిశుభ్రత జాడేది?

జిల్లాలోనూ ఇటీవల పచ్చదనంతోపాటు పారిశుధ్య కార్యక్రమాన్నీ నిర్వహించారు. కానీ.. ఆ కార్యక్రమం చేపట్టినా పెద్దగా మార్పు కనిపించలేదు. ఎక్కడా దాని ప్రభావం లేదు. సరైన డ్రైనేజీలు లేకపోవడంతో రోడ్లపై, ఇళ్ల మధ్యలో మురికినీరు నిలుస్తోంది. వీటిలోనే దోమలు పెరుగుతున్నాయి. రోగాలకు కారణమవుతున్నాయి. మున్సిపాలిటీల్లో చెత్త ఆటోలు వస్తున్నా.. చాలామంది వాటిని వినియోగించుకోవడం లేదు. రోడ్ల మూలల్లో, ఇంటిపక్కన సందుల్లో పడేస్తున్నారు. గ్రామాల్లో డ్రైనేజీలు, మురికిగుంటలు, పెంటకుప్పలు ఏమాత్రం మారలేదు. చాలా ఊళ్లల్లో తడిచెత్త, పొడిచెత్త వేరుచేసే వ్యవస్థ దెబ్బతింది. నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల్లోనూ డ్రైనేజీ వ్యవస్థ లేదు. జిల్లా కేంద్రం నిర్మల్‌లో మరీ దారుణంగా మురికినీటిని మొత్తం గొలుసుకట్టు చెరువుల్లోకి మళ్లించారు. ఆ చెరువులు, కుంటల చుట్టూ ఉన్న కాలనీల్లోనే ఎక్కువగా జ్వరాలు ప్రబలుతున్నాయి.

దోమలు పెంచుతూ.. జ్వరాలు తెచ్చుకుంటూ..

ప్రస్తుత సీజన్‌లో చాలా రోగాలకు దోమలే కారణం. వీటిని దూరం చేసుకోవాల్సింది పోయి, ఇంటి సమీపంలోనే పెంచుకుంటున్న తీరు దారుణం. నీటిని నిల్వ ఉంచొద్దని తెలిసినా.. ప్రభుత్వం, అధికారులు చెబుతున్నా.. ఇళ్లల్లో ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఎండాకాలం వెళ్లిపోయి నెలలు గడుస్తున్నా.. ఇప్పటికీ కూలర్లలో నీటిని తొలగించని వాళ్లూ ఉన్నారు. ఇంటిపక్క సందుల్లోనే తాగిపడేసిన కొబ్బరిబొండాలు, బంగ్లాలపై పాతటైర్లు అలాగే ఉంచుతున్నారు. ఇక ఇంటిని అందంగా కట్టుకుంటున్నారే తప్ప.. ఇంటిముందు డ్రైనేజీని మాత్రం కట్టేందుకు ముందుకు రావడం లేదు. సరైన డ్రైనేజీ లేకపోవడంతో మురికినీరు అక్కడే నిలుస్తోంది. కనీసం రెండురోజులకోసారి చెత్తబండి వస్తున్నా... పక్కన ఖాళీగా ఉన్న ప్లాట్లలోనే చెత్తను పడేస్తున్నారు. రూ.లక్షలు పెట్టి ప్లాట్లు కొంటున్న వాళ్లు.. తమ ప్లాట్లలో ఉన్న మురికిగుంతలను మాత్రం పూడ్చడం లేదు. ఇలాంటి వాటిపై పంచాయతీలు, మున్సిపాలిటీలూ చర్యలు చేపట్టడం లేదు. సంబంధిత ప్రభుత్వ శాఖల నిర్లక్ష్యానికి తోడు.. ఇళ్లలోనూ స్వయం తప్పిదాలే దోమల వృద్ధికి కారణమవుతున్నాయి. ఇవే ప్రాణాంతక జ్వరాలను వ్యాప్తి చేస్తున్నాయి.

చర్యలు తీసుకుంటున్నాం

నిర్మల్‌లోని కొన్ని వార్డుల్లో పారిశుధ్య సమస్యలు ఉన్నాయి. నాలుగు రోజులు కార్మికుల సమ్మె కారణంగా పట్టణంలో పారిశుధ్యం లోపించింది. అయినా దోమల నివారణ చర్యలు చేపడుతున్నాం. ప్రధానంగా ఖాళీ ప్లాట్లు ఉన్నవారు మురికినీరు నిలువకుండా చదును చేసుకోవాలని చెబుతున్నాం. లేనిపక్షంలో నోటీసులు ఇస్తాం.

– రాజు, మున్సిపల్ కమిషనర్, నిర్మల్

ప్రజా ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజావాణి ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధి కారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా వాణికి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి విద్య, వైద్యం, రుణమాఫీ, వరద నష్టం, రెవె న్యూ, ధరణి, తదితర సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న సమస్యల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. అనంతరం శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరి ష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఆర్వో భుజంగరావు, ఆర్డీవో రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెమో ఇవ్వడంలేదని ఫిర్యాదు

లక్ష్మణచాంద: తనకు పదో తరగతి ఒరిజినల్ మెమో ఇవ్వడం లేదంటూ ఓ విద్యార్థి ప్రజావాణిలో కలెక్టర్ అభిలాష అభినవ్‌కు ఫిర్యాదు చేశాడు. సోన్ మండలంలోని న్యూ వెల్మల్ గ్రామానికి చెందిన ఎల్లుల్ల ముకేష్ 2022లో లక్ష్మణచాంద ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓపెన్‌లో పదోతరగతి ఉత్తీర్ణుడయ్యాడు. అప్పటి నుంచి హెచ్ఎం తనకు మెమో ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. దీనిపై హెచ్ఎం రాజు నాయక్‌ను 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా తాను 2023 సెప్టెంబర్‌లో పాఠశాలకు బదిలీపై వచ్చానని, అప్పటి నుంచి సదరు విద్యార్థికి సంబంధించిన ఎలాంటి మెమో పాఠశాలకు రాలేదన్నారు.

ఇంటింటా రుణమాఫీ సర్వే

- మాఫీకాని రైతుల వద్దకు వెళ్లి వివరాలు సేకరిస్తున్న అధికారులు
- రైతుభరోసా యాప్‌లో నమోదు
- జిల్లాలో కుటుంబ నిర్ధారణ కానివారు సుమారు 12 వేల మంది



రుణమాఫీ సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

నిర్మల్‌చైన్‌గేట్: సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతుల కుటుంబ నిర్ధారణ కార్యక్రమం జిల్లాలో ప్రారంభమైంది. జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏవోలు క్షేత్రస్థాయికి వెళ్లి రైతుల నుంచి కుటుంబ వివరాలు సేకరిస్తున్నారు. ఆ వివరాలను ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి ప్రభుత్వానికి పంపుతున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అవుతుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

ప్రత్యేక దృష్టి..

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షలలోపు రైతు రుణమాఫీ అమలు చేసింది. మూడు విడతలుగా రుణమాఫీ చేయగా, అన్ని అర్హతలు ఉన్నా జిల్లా వ్యాప్తంగా వేలాది మంది రైతుల రుణాలు మాఫీ కాలేదు. కొందరికి రేషన్ కార్డులు లేకపోవడం, ఆధార్ కార్డులో తప్పులు దొర్లడం, పట్టదారు పాస్‌బుక్‌లో పేరు, ఆధార్ కార్డులో పేరుతో సరిపోలకపోవడం తదితర సాంకేతిక కారణాలతో చాలా మంది రైతులు రుణమాఫీకి దూరమయ్యారు. దీంతో రైతులు వ్యవసాయ కార్యాలయం, బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రుణమాఫీ కాని రైతులపై ఫోకస్ పెట్టింది.

వివరాల నమోదుకు యాప్..

రుణమాఫీ కాని రైతులు ఆందోళనకు దిగడం, మండల, జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లకు ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. సాంకేతిక సమస్యలతో చాలా మందికి రుణాలు మాఫీ కాలేదని వ్యవసాయ అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. ఈ నేపథ్యంలో బాధిత రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేసేందుకు ప్రభుత్వం రైతుభరోసా యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. అధికారులు సర్వేలో సేకరించిన రుణమాఫీ కాని రైతుల వివరా లను యాప్‌లో నమోదు చేయనున్నారు. రుణమాఫీ కాని రైతుల జాబితా ఇప్పటికే అధికారులకు చేరింది. ఏఈవోలతో కలిసి గ్రామాల వారీగా సర్వే చేపట్టడానికి అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు.

సర్వే ఇలా..

- రుణమాఫీ కాని రైతుల ఇళ్లకు వ్యవసాయ అధికారులు వెళ్తారు. ఇంటి యజమాని, అతని భార్య, కుమారుడు, కూతురు, ఇతర కుటుంబీకులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు, ఆధార్ కార్డు నంబర్ల ఆధారంగా గుర్తిస్తారు.
- ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకాలను పరిశీలించి రైతుల పేర్లు పోల్చి చూస్తారు.
- ఇదే సమయంలో మండల వ్యవసాయ అధికారి రైతులతో సెల్ఫీ దిగుతారు.
- రైతు సంతకం తీసుకుంటారు. ధ్రువీకరిస్తూ పంచాయతీ కార్యదర్శి సంతకం కూడా తీసుకుంటారు. సేకరించిన వివరాలతోపాటు సెల్ఫీ ఫొటోను రైతుభరోసా యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు.

ఆధార్ కార్డులు ఇవ్వాలి..



కుటుంబ సభ్యులు నిర్ధారణకాక రుణమాఫీ అందని రైతులంతా మండల వ్యవసాయాధికారి గ్రామానికి వచ్చినప్పుడు ఆధార్ కార్డు నంబర్లు అందజేయాలి. అదే విధంగా కుటుంబ సభ్యుల వివరాలతో ధ్రువీకరణ పత్రాన్ని విధిగా సమర్పించాలి. రుణమాఫీపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి

సదర్మాట్ జలం.. ఆయకట్టుకు జీవం

- బ్యారేజీతో 18 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



పొన్కల్ వద్ద నిర్మించిన సదర్మాట్ బ్యారేజీ

మామడ: మండలంలోని పొన్కల్ సమీపంలో గోదావరి నదిపై బ్యారేజీ నిర్మించేందుకు 2016లో అక్టోబర్ 25న ఒప్పందం కుదిరింది. 2017 జనవరిలో పనులు ప్రారంభించారు. ప్రస్తుతం నిర్మాణం పనులు పూర్తయ్యాయి. బ్యారేజీ ప్రారంభానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రాజెక్టుకు వెళ్లేందుకు ఇరుప్రాంతాల నుంచి రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. బ్యారేజీ నిర్మాణంతో నిర్మల్, జగిత్యాల్ జిల్లాలకు చెందిన 500 మందికిపైగా రైతులకు చెందిన 1,230 ఎకరాలు ముంపుకు గురవుతున్నాయి. జగిత్యాల్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి, మూలరాంపూర్, నిర్మల్ జిల్లా మామడ మండలం కమల్‌కోట్, పొన్కల్, టెంబుర్ని, ఆదర్శనగర్ గ్రామాలకు చెందిన రైతుల వ్యవసాయ భూములు బ్యారేజీలో ముంపునకు గురయ్యాయి. భూములు ఇచ్చిన రైతులు ప్రభుత్వం పరిహారం ఇచ్చింది.

18 వేల ఎకరాలకు సాగునీరు..

బ్యారేజీ నిర్మాణంతో నిర్మల్ జిల్లాలోని 13,120 ఎకరాలు, జగిత్యాల జిల్లాలో 4,896 ఎకరాల ఆయకట్టుకు రెండు పంటలకు సాగునీరందనుంది. దీంతో ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది. బ్యారేజీకి దిగువన గోదావరిపై ఖానాపూర్ సమీపంలో 1897లో నిర్మించిన సదర్మాట్ బ్యారేజీ, జగిత్యాల్ జిల్లా పరిధిలోని గంగనాల ప్రాజెక్ట్ నిర్మాణాలు ఉన్నాయి. ఈ రెండు ప్రాజెక్టులకు పొన్కల్ గోదావరి వద్ద నిర్మించిన సదర్మాట్ బ్యారేజీలో నిల్వ చేసిన నీటితో పూర్తి స్థాయిలో సాగుకు నీరు అందించే విధంగా రూ.554.28 కోట్లతో బ్యారేజీ నిర్మాణం చేపట్టారు.

బ్యారేజీ వివరాలు..	
ముంపునకు గురయ్యే భూమి	1,230 ఎకరాలు
బ్యారేజీ పొడవు	987 మీటర్లు
నీటి నిల్వ సామర్థ్యం	1.58 టీఎంసీలు
బ్యారేజీ గేట్లు	55
బ్యారేజీ నిర్మాణ వ్యయం	రూ.554.28 కోట్లు
ఆయకట్టు స్థిరీకరణ	18,016 ఎకరాలు

కిలోమీటర్ పొడవు, 55 గేట్లు..

సదర్మాట్ బ్యారేజీ పొడవు కిలోమీటర్ ఉండగా, బ్యారేజీపై 7.5 మీటర్లతో వాహనాలు వెళ్లే విధంగా రోడ్డు నిర్మాణం చేపట్టారు. బ్యారేజీకి 55 గేట్లు అమర్చగా ఒక్కో గేటు పొడవు 15 మీటర్లు, 8 మీటర్ల ఎత్తుతో ఉంటుంది. బ్యారేజీ నుంచి పొన్కల్ వైపు 750 మీటర్లు, జగిత్యాలవైపు రోడ్డుకు 1050 మీటర్ల దూరం రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

బీజేపీకి ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వాలు

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వాలు కలిగి ఉన్న పార్టీ బీజేపీ అని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నిర్మల్ పట్టణంలోని మారుతి ఇన్ హోటల్‌లో సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 10 కోట్ల మందిని సభ్యులుగా మార్చడమే లక్ష్యంగా సభ్యత్వ నమోదు జరగాలన్నారు. 8800002024 నంబర్‌కు ఒక మిస్డ్‌కాల్ ఇచ్చి సభ్యత్వ నమోదు చేసుకోవాలన్నారు. తెలంగాణలో ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి 77 లక్షల ఓట్లు వచ్చాయని, వారందరినీ బీజేపీ సభ్యులుగా చేర్పించేందుకు ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నమోదు కార్యక్రమ కన్వీనర్ అల్లూరి శ్రీనివాస్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సత్యనారాయణ గౌడ్, పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు సామ రాజేశ్వర్ రెడ్డి, మెడిసెమ్మె రాజు, జిల్లా సభ్యత్వ నమోదు కన్వీనర్ కమల్ నాయన్, కోకన్వీనర్ శ్రవణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల హామీలు నెరవేర్చాలి



అమరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నిర్మల్‌టౌన్: తెలంగాణ ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఫోరం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ అన్నారు. ఉత్తర తెలంగాణ ఉద్యమకారుల చైతన్య యాత్ర సోమవారం నిర్మల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న అమరుల స్తూపానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం టీఎన్జీవో భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27న సికింద్రాబాద్‌లోని హరిహర కళా భవన్‌లో నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాకాల రాంచందర్, ఉమ్మడి జిల్లాల చైర్మన్ కొట్టే శేఖర్, జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణంరాజు, రాష్ట్ర కార్యదర్శి సురేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణ గౌడ్, కిరణ్ రెడ్డి, ప్రభాకర్, ఇస్మాయిల్, జీవన్, అజయ్, గంగన్న, తెలంగాణ షరీఫ్, వివిధ మండలాల జేఏసీ నాయకులు, ఉద్యమకారులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు



బహుమతులు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నిర్మల్‌రూరల్: ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం సోఫీనగర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు కాళోజీ జీవితం, సాహిత్యంపై జిల్లాస్థాయి వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు దాదాపు 50 మంది ఈ పోటీలలో పాల్గొన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డానియల్, కవులు అంబటి నారాయణ, కొండూరు పోతన్న, తెలుగు భాషా ఉపాధ్యాయులు రవిబాబు కాళోజీ గురించి పద్యాలు, కవితల రూపంలో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సమన్వయకర్తలు ప్రవీణ్ కుమార్, నర్సయ్య, జిల్లా సైన్స్ అధికారి వినోద్ కుమార్, తెలుగు ఉపాధ్యాయులు చిన్నయ్య, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ ఉంటే రూ.పది లక్షలు మీవే!

- 'ఆర్బీఐ 90'పేరిట క్విజ్‌పోటీలు
- 25 ఏళ్లలోపు విద్యార్థులు అర్హులు
- జిల్లా, రాష్ట్ర, జోనల్, జాతీయస్థాయిల్లో పోటీలు
- ఈనెల 17 వరకు దరఖాస్తులకు గడువు
- ఆర్థిక అక్షరాస్యత పెంపొందించడమే లక్ష్యం



ఆన్‌లైన్ దరఖాస్తు హోమ్ పేజీ ఇదే

నిర్మల్‌ఖిల్లా: విద్యార్థులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) అద్భుతమైన అవకాశం కల్పిస్తోంది. ఆర్బీఐ 90వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా దేశవ్యాప్తంగా డిగ్రీ, పీజీ విద్యార్థులకు 'ఆర్బీఐ 90 క్విజ్'పేరిట జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తోంది. ఇప్పటికే ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల 17వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకునేందుకు గడువు ఉంది. ఈనెల 19 నుంచి 21 వరకు ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు పోటీలు జరగనున్నాయి. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులు పాల్గొనవచ్చు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చితే రూ.10 లక్షలు గెలుచుకునే అవకాశం ఉంది.

దరఖాస్తు విధానం ఇలా...

2024 సెప్టెంబర్ 1 నాటికి 25 ఏళ్లలోపు వయసు ఉండి ఏదైనా కళాశాలలో డిగ్రీ చదువుతున్నవారు పోటీల్లో పాల్గొనవచ్చు. www. rbi90 quiz. in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 17లోగా దరఖాస్తులు చేసుకోవచ్చు. గుర్తింపు కార్డ్, ఈమెయిల్ ఐడీ, ఫోన్ నెంబర్, పుట్టిన తేదీ వివరాలను నమోదు చేయాలి. ఇందుకు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. ఒక్కో కళాశాల నుంచి ఎంతమంది అయినా దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక్కో బృందానికి ఇద్దరు విద్యార్థులు ఉండాలి. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ బి.రాంగోపాల్, నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ కోరుతున్నారు.

నాలుగు దశల్లో..

నాలుగు దశల్లో ఆర్బీఐ క్విజ్ పోటీలు జరగనున్నాయి. జిల్లా స్థాయి, రాష్ట్ర, జోనల్, జాతీయ స్థాయిలో పోటీలు ఉంటాయి. మొదటి రౌండ్‌లో ఆన్‌లైన్‌లో జరుగుతుంది. ఇందులో 36 మల్టీపుల్ ప్రశ్నలు ఉంటాయి. 15 నిమిషాల్లో సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. ఇద్దరు విద్యార్థుల జతతో ఒకే పరికరం (ఫోను, టాబ్లెట్, లాప్‌టాప్, కంప్యూటర్) ద్వారా పోటీల్లో పాల్గొనాలి.

- విద్యార్థుల్లో ఆర్బీఐ ఆర్థిక వ్యవస్థ గురించి అవగాహన, డిజిటల్ లావాదేవీలు, సురక్షిత బాధ్యతాయుత వినియోగం తదితర వాటి గురించి యువతలో ప్రోత్సహించే లక్ష్యంతో ఈ క్విజ్‌పోటీలు నిర్వహిస్తోంది.
- దేశ, అంతర్జాతీయ, ఆర్థిక వ్యవహారాలు, ఆర్బీఐ చారిత్రక నేపథ్యం, ఆర్థిక వ్యవస్థ, క్రీడలు, చరిత్ర సాహిత్యం, శాస్త్ర సాంకేతిక రంగాలు, సమకాలీన అంశాలపై హిందీ, ఆంగ్లభాషల్లో ప్రశ్నలు ఉంటాయి.
- జిల్లాస్థాయి ఆన్‌లైన్ పోటీల్లో విజేతగా ఎంపికైన వారికి తదుపరి పోటీలకు హాజరయ్యేందుకు రవాణా, వసతి తదితర ఖర్చులను ఆర్బీఐ భరిస్తుంది. సంబంధిత కళాశాల అధ్యాపకుడు కూడా ఎంపికైన విద్యార్థులతోపాటు వెళ్లే అవకాశం కల్పిస్తుంది.

నగదు బహుమతుల వివరాలు

స్థాయి	ప్రథమ	ద్వితీయ	తృతీయ
రాష్ట్ర	రూ.2లక్షలు	రూ.1.50లక్షలు	రూ.లక్ష
జోనల్	రూ.5లక్షలు	రూ.4లక్షలు	రూ.3లక్షలు
జాతీయ	రూ.10లక్షలు	రూ.8లక్షలు	రూ.6లక్షలు

ఉరిశిక్ష పడే వరకు పోరాడతాం


గాదిగూడలోని కుమురం భీం చౌక్ వద్ద ఆదివాసీ గిరిజనుల నిరసన

ఆదిలాబాద్‌రూరల్/నార్నూర్(గాదిగూడ): జైనూర్‌లో ఆదివాసీ మహిళపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి ఉరిశిక్ష పడేవరకు పోరాడతామని ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) మహిళా విభాగం జిల్లా కన్వీనర్ గోడం రేణుక తెలిపారు. సోమవారం మావల మండలం బట్టిసావర్‌గాం శివారులోని కుమురం భీం కాలనీలో ఆమె మాట్లాడారు. జైనూర్‌లో ఏజెన్సీ ప్రాంతం చట్టానికి అనుగుణంగా 1950 తర్వాత వలస వచ్చిన వారిని ప్రభుత్వం వెంటనే తరలించాలన్నారు. వారి భూ యజమాన్య హక్కు, ఆధార్, రేషన్, ఓటర్ ఐడీ కార్డులు, వాణిజ్య వ్యాపార హక్కులు రద్దు చేయాలన్నారు. జైనూర్ ఘటనలో ఆదివాసీలపై ఎదురుదాడి చేసిన వారిపై అట్రాసిటీ, హత్యాయత్నం కేసులు నమోదు చేయాలన్నారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపించి నిందితుడికి ఉరిశిక్ష పడేవరకు ఆదివాసీలంతా ఉద్యమిస్తామని ఝరి రాయిసెంటర్ సార్‌మెడి మందాడి దౌలత్ రావు, డోకారి(కే) మాజీ సర్పంచ్ మెస్రం దేవరావు తెలిపారు. గాదిగూడలోని కుమురం భీం చౌక్ వద్ద, లోకరి(కే) గ్రామ ప్రధాన రహదారి వద్ద నిరసన తెలిపారు. సమావేశంలో మహిళా విభాగం జిల్లా కో కన్వీనర్ ఉయిక ఇందిరా, మావల మండల అధ్యక్షురాలు కుమ్ర శాంతాబాయి, ప్రధాన కార్యదర్శి మడావి అనుసూయ, జంగుబాయి, కమల, చంద్రకళ, గితేదారి కొడప జాకు, మాజీ ఎంపీటీసీ సీడాం నాగరావ్, కుడ్మేత భారత్, తాజా మాజీ సర్పంచ్ మెస్రం జైవంత్ రావు, కుంరం శంకర్, నాయకులు పేందుర్ మరోతి, చిక్రం నాగరాజ్, 9 తెగల ఆదివాసీ గిరిజనులు పాల్గొన్నారు.

రిమ్స్ బాత్రూంలో జారిపడి క్రికెటర్ మృతి


శ్రీహరి (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన క్రికెటర్ (చిన్ను) శ్రీహరి (30) రిమ్స్ ఆస్పత్రి బాత్రూంలో జారిపడి మృతిచెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాలు..తన కుమారుడికి జ్వరం రావడంతో రిమ్స్‌లో ఇటీవల రక్తనమూనాలు ఇచ్చాడు. రిపోర్టు కోసం సోమవారం ల్యాబ్‌కు వెళ్లాడు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు బాత్రూమ్ వెళ్లగా కాలుజారి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అటువైపుగా వెళ్తున్న వారు గమనించి సిబ్బందికి తెలియజేశారు. అప్పటికే మృతిచెందినట్లు పేర్కొన్నారు. బాత్రూం అపరిశుభ్రంగా ఉండడంతోనే కుమారుడు మృతిచెందినట్లు పేర్కొన్నారు. కాగా మృతుడికి భార్యతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతితో తోటి క్రీడాకారులు కన్నీరు మున్నీరయ్యారు. క్రీడాకారుడి మృతిపట్ల బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. క్రీడా పోటీలు జరిగిన సమయంలో పలు సందర్భాల్లో ఆయన తన చేతుల మీదుగా బహుమతులు అందుకున్నట్లు గుర్తుచేశారు.

తాళం వేసిన రెండిళ్లలో చోరీ


జన్నారంలో క్లూస్ టీంతో పరిశీలిస్తున్న సీఐ


ఆదర్శనగర్‌లో పగులగొట్టిన ఇంటి తాళం

జన్నారం/నిర్మల్‌టౌన్: తాళం వేసిన రెండిళ్లలో దొంగలు పడి చోరీకి పాల్పడిన ఘటన జన్నారం, నిర్మల్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. జన్నారం మండలకేంద్రంలో రామ్‌సింగ్ రాజ్ పురోహిత్.. ఎలక్ట్రికల్, హార్డ్ షాపు నిర్వహిస్తున్నాడు. షాపు పైన ఇల్లు ఉంది. ఆదివారం రాత్రి ఇంటికి తాళం వేసి సొంత పనిపై కుటుంబ సభ్యులతో కలిసి మంచిర్యాల వెళ్లాడు. తిరిగి తెల్లవారు జాము 3 గంటలకు ఇంటికి చేరుకున్నాడు. చూసేసరికి తాళం పగులగొట్టి బీరువాలో 4 తులాల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండిని దొంగలు ఎత్తుకెళ్లారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం లక్సెట్టిపేట సీఐ నరేందర్, ఎస్సై రాజవర్ధన్ ఘటన స్థలానికి చేరుకున్నారు. క్లూస్‌టీంతో ఫింగర్ ప్రింట్‌లు సేకరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆదర్శనగర్‌లో..

నిర్మల్‌లోని ఆదర్శనగర్‌లో ఇంటికి తాళం వేసి శ్రీనివాస్ తన కుటుంబ సభ్యులతో కలిసి బర్త్ డే వేడుకల కోసం బంధువుల ఇంటికి వెళ్లారు. నాలుగు రోజుల తర్వాత సోమవారం ఇంటికి తిరిగి వచ్చారు. చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. బీరువాలో రూ.30 వేల నగదు, 3 తులాల బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారని బాధితుడు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బాసర ఆలయం చుట్టూ సోలార్ కంచె



బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయ ప్రాంగణం చుట్టూ సోమవారం సోలార్ విద్యుత్ కంచె ఏర్పాటు చేశారు. ఇటీవల ఓ దొంగ ఆలయం లోపలికి చొరబడి చోరీకి పాల్పడిన విషయం తెలిసిందే. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు ఆలయం చుట్టూ సోలార్ విద్యుత్ కంచె ఏర్పాటు చేశారు. ఆలయ భద్రతకు సంబంధించి ఎస్సై గణేశ్, పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.

ఉద్యమకారుల ఫోరం ఉపాధ్యక్షుడిగా 'పాకాల'


నియామకపత్రం అందుకుంటున్న రాంచందర్

నిర్మల్‌టౌన్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పాకాల రాంచందర్ నియమితులయ్యారు. జిల్లాకేంద్రంలో ఆయనకు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ సోమవారం నియామకపత్రం అందజేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చైర్మన్ కొట్టే శేఖర్, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి సామకిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒకేసారి రెండు సర్కారు కొలువులు


కుటుంబసభ్యులతో సాయిస్నేహిత్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పిల్లి కిషన్–శోభ దంపతుల కుమారుడు సాయిస్నేహిత్ రెండు ప్రభుత్వ కొలువులకు ఎంపికయ్యాడు. వినాయక చవితి రోజున టీఎస్ జెన్కో నిర్వహించిన పరీక్షలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా ఉద్యోగం సాధించగా, గేట్‌లో 2023వ ర్యాంక్ ద్వారా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కేంద్ర ప్రభుత్వ కొలువుకు ఎంపికయ్యాడు. పట్టణంలో పదో తరగతి వరకు విద్యనభ్యసించగా, ఆ తర్వాత హైదరాబాద్‌లో ఇంటర్, బీటెక్, ఐఐటీ గౌహతిలో ఎంటెక్ పూర్తిచేశాడు. ఒకేసారి రెండు సర్కారు కొలువులు రావడంతో కుటుంబీకులతో ఆయన బంధువులు, స్నేహితులు శుభాకాంక్షలు తెలియజేశారు.

పిప్పల్‌కోటిలో మహారాష్ట్ర పోలీసుల విచారణ

తాంసి: మహారాష్ట్ర పిప్పల్‌గావ్ అటవీ ప్రాంతంలో భీంపూర్ మండలం పిప్పల్‌కోటికి చెందిన జానకొండ నారాయణ (38) మృతదేహం కాలిపోయిన స్థితిలో గుర్తించిన విషయం తెలిసిందే. కాగా, సోమవారం పిప్పల్‌కోటిలో మహారాష్ట్రలోని కిన్వట్‌లోని డీఎస్పీ సీఐ, మాండ్వి పోలీసులు విచారణ చేపట్టారు. ఇది హత్యనా లేక ఆత్మహత్యనా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం ఆధారంగా హత్యగానే తేల్చినట్లు భావిస్తున్నారు. నారాయణ భార్య విజయలక్ష్మిని అదుపులోకి తీసుకున్నారు. నారాయణ ఆత్మహత్యనా లేక హత్య చేశారా అని గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

త్రిపుల్‌ఐటీలో ముగిసిన ఆందోళనలు


విద్యార్థులతో వీసీ వెంకటరమణ

- విద్యార్థులతో సమావేశమైన అధికారులు
- దశలవారీగా సమస్యల పరిష్కారానికి హామీ

భైంసా: బాసర త్రిపుల్‌ఐటీలో సమస్యల పరిష్కారం కోరుతూ విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు ముగిశాయి. తెలంగాణ స్టూడెంట్ అసోసియేషన్ ఫర్ సాలిడారిటీ ఆధ్వర్యంలో ఈనెల 4 నుంచి నిరసన కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిరవధికంగా జరిగిన నిరసనలకు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండ రాం మద్దతు ప్రకటించారు. ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ విద్యార్థుల సమస్యలపై ఉన్నతాధికారులతో సోమవారం మాట్లాడారు. ఇటీవలే నిర్మల్‌కు వచ్చిన మంత్రి శ్రీధర్‌బాబుతోనూ త్రిపుల్‌ఐటీ ఇబ్బందులపై చర్చించారు. తాజాగా సోమవారం ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ త్రిపుల్ ఐటీలో అడ్మినిస్ట్రేషన్, చీఫ్ వార్డెన్, స్టూడెంట్ వెల్ఫేర్‌తో పాటు ఇతర అధికారులతో కలిసి విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల డిమాండ్లపై చర్చించారు. రెగ్యులర్ వీసీతో పాటు హాస్టల్ మరమ్మతులు, వైఫై సమస్యలు, సెంట్రల్ లైబ్రరీ, ఆసుపత్రి, ఆర్థిక వ్యవహారాల లావాదేవీలు, గడువు ముగిసిన టెండర్లు, మెస్ నిర్వహణ, ఇతర అంశాలపై చర్చించి దశలవారీగా పరిష్కారానికి హామీ ఇచ్చారు. త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ తెలిపారు. శాంతియుత వాతావరణం నెలకొనేలా చూడాలని కోరారు. ప్రభుత్వంలోని ఉన్నతాధికారులతో చర్చించి ఈ సమస్యలను పరిష్కరించేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తానని అధికారులు హామీ ఇవ్వడంతో విద్యార్థులు శాంతించారు.

త్రిపుల్‌ఐటీ అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరపాలి


సర్దార్ వినోద్‌కుమార్

భైంసా: బాసర త్రిపుల్ ఐటీలో అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరపాలని ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ అధ్యక్షుడు సర్దార్ వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరు రోజులుగా తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ ఫర్ సాలిడారిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్నా ఎవరూ స్పందించడంలేదన్నారు. పైగా ఇక్కడి అక్రమాలు కప్పిపుచ్చుకునేందుకు ప్రభుత్వంతో పాటు ఉన్నతాధికారులను క్యాంపస్ అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులు నిరసనలు చేస్తే మద్దతుగా వెళ్తున్న విద్యార్థి సంఘాల నాయకులను లోనికి అనుమతించడం లేదన్నారు. త్రిపుల్‌ఐటీలో జరిగిన అక్రమాలపై తన వద్ద పూర్తిస్థాయి ఆధారాలు ఉన్నాయని, త్వరలో విద్యార్థి సంఘాలతో కలిసి సమావేశం ఏర్పాటు చేసి పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

సరస్వతీ అమ్మవారి సన్నిధిలో పూజలు


కుటుంబ సభ్యులతో అనిల్‌కుమార్

బాసర: శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారిని రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ చీఫ్ గుమ్మడి అనిల్ కుమార్ కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనిల్ కుమార్ మనమరాలికి అర్చకులతో అన్నప్రాసన చేయించారు. ముందుగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్ వారికి స్వాగతం పలికారు. దర్శనం అనంతరం అనిల్ కుమార్‌కు బాసర లిఫ్ట్ ఇరిగేషన్ సమస్యను మాజీ సర్పంచ్ రమేశ్ వివరించారు. వెంటనే ఆయన స్పందించి రూ.20 కోట్ల వరకు ప్రతిపాదనలు చేసి పంపాలని డీఈ, జేఈలను ఆదేశించారు. వీరి వెంట ఏఈఈ రమేశ్, రజనీకాంత్, నాగరాజు ఉన్నారు.

చెరువులో దూకి వివాహిత ఆత్మహత్య

లోకేశ్వరం: చెరువులో దూకి వివాహిత ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామానికి చెందిన సుంకరి సాయవ్వ (45)–విఠల్ భార్యభర్తలు. వీరిద్దరు పుస్పూర్‌లో పాలేరుగా పని చేస్తున్నారు. కొంత కాలంగా సాయవ్వకు మతిస్థిమితం లేక తిరుగుతుండేది. ఈనెల 6న ఆమె కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. వారు ఫిర్యాదుతో పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. అప్పటి నుంచి సాయవ్వ ఆచూకీ కోసం గాలిస్తుండగా పుస్పూర్ గ్రామంలోని చెరువులో శవమై సోమవారం కనిపించింది. మృతురాలు చెల్లెలు రామేలి అనురాధ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారైలు ఉన్నారు.

పురుగుల మందు తాగి వృద్ధుడు..


చిన్న భూమన్న మృతదేహం

జైనథ్: మండల కేంద్రానికి చెందిన వృద్ధుడు అల్లకొండ చిన్న భూమన్న (64) గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై పురుషోత్తం కథనం ప్రకారం.. చిన్న భూమన్న గత ఐదేళ్లుగా ఆస్తమాతో బాధపడుతున్నాడు. కుటుంబీకులు అతన్ని పలు ఆసుపత్రుల్లో చూపించినా నయం కాలేదు. ఈనెల 7న రాత్రి భూమన్నకు శ్వాస తీసుకోవడం ఇబ్బంది అయింది. దీంతో జీవితంపై విరక్తితో పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు ఆయన్ను వెంటనే 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కుమారుడు గణేశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థికి పాముకాటు

- సకాలంలో చికిత్సతో తప్పిన ప్రాణాపాయం


చికిత్స పొందుతున్న విద్యార్థి యశ్వంత్

తాంసి: భీంపూర్ మండలం ధనోర ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థికి పాముకాటు వేసింది. ఒకటవ తరగతి చదువుతున్న మామిడి యశ్వంత్ తోటి విద్యార్థులతో కలిసి సోమవారం మధ్యాహ్నం పాఠశాల వరండాలో చివరన కూర్చున్నాడు. వరండాలో టైల్స్ కింద ఉన్న రంధ్రం నుంచి వచ్చిన పాము యశ్వంత్ కాలిపై కాటేసింది. తోటి విద్యార్థులు ఈ విషయాన్ని ఉపాధ్యాయులకు చెప్పారు. టీచర్ సురేశ్ ఆ విద్యార్థికి పాము కాటేసిన చోట నోటితో రక్తాన్ని తీసి కాలికి దారం కట్టాడు. ఆ టీచర్, హెచ్‌ఎం హన్మాండ్లు బైక్‌పై విద్యార్థిని భీంపూర్ పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పాముకాటు మందు ఉన్నా వైద్యాధికారి అందుబాటులో లేకపోవడంతో సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. సకాలంలో చికిత్స అందించడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రస్తుతం విద్యార్థి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా


అర్జీలు స్వీకరిస్తున్న ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల అర్జీలు సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల ప్రజలు, గిరిజనుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్జీలను శాఖల అధికారులు పరిశీలించి వెంటనే అర్హులకు న్యాయం చేయాలన్నారు. కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్‌డీసీ గంగాధర్, ఏవో రామోదర్, పీహెచ్‌వో సందీ, జేడీఎం నాగభూషణం, పెసా కోఆర్డినేటర్ వసంత్‌రావు, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు తదితరులు పాల్గొన్నారు.

- ఉపాధి కోసం రుణం ఇప్పించాలని ఉట్నూర్ మండలం రాంజీగోండు గ్రామానికి చెందిన మణికుమార్ విన్నవించాడు.
- ఉట్నూర్‌కు చెందిన రాధ తన హోటల్ కోసం రుణం ఇప్పించాలని అర్జీ అందించింది.
- సీఆర్పీ ఉద్యోగం కల్పించాలని హాజీపూర్ మండలం పెద్దమ్మపేట గ్రామానికి చెందిన సరోజ వేడుకుంది.
- ఏఎన్‌ఎం ఉద్యోగం ఇవ్వాలని నేరడిగొండ మండలానికి చెందిన కవిత అర్జీ అందించింది.

స్వగ్రామానికి చేరిన మృతదేహం


నర్సయ్య మృతదేహం

భైంసారూరల్: ఉపాధి కోసం దుబాయ్ వెళ్లి అనారోగ్యంతో మృతిచెందిన నర్సయ్య మృతదేహం స్వగ్రామమైన కోతల్‌గాంకు చేరుకుంది. కుటుంబీకులు తెలిపిన వివరాలు.. సట్ల నర్సయ్య (50) ఉపాధి కోసం ఏడాది క్రితం దుబాయ్ వెళ్లాడు. అక్కడే పని చేస్తున్నాడు. గతనెల 22న అనారోగ్యంతో మృతిచెందాడు. గతంలో వ్యవసాయ పనులు చేసేవాడు. పంటలు పండక కుటుంబ పోషణకు అప్పులు చేశాడు. అవి తీర్చేందుకు దుబాయి వెళ్లాడు. ఏడాదిగా బాగానే పనిచేసుకున్నాడు. అస్వస్థతకు గురైన ఆయన గతనెలలో మృతిచెందాడు. కుటుంబీకులకు ఈ విషయం తెలియడంతో మృతదేహం స్వగ్రామానికి రప్పించాలని వేడుకున్నారు. మృతదేహం సోమవారం ఇంటికి చేరుకోగానే కుటుంబీకులు రోదించారు. అనంతరం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

క్లుప్తంగా

పాముకాటుతో వృద్ధురాలి మృతి


వివరాలు నమోదు చేస్తున్న ఏఎస్సై అభిబ్

జైపూర్: మండలంలోని వెంక్రటావుపల్లికి చెందిన వృద్ధురాలు దుర్గం శివమ్మ(77) పాముకాటుతో మృతి చెందిందని ఎస్సై శ్రీధర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం .. వెంక్రటావుపల్లిలో తన కుమార్తె గోదారి పద్మ ఇంటి వద్ద శివమ్మ ఉంటుంది. ఆదివారం రాత్రి అన్నం తిని అందరూ నిద్రించారు. మంచంపై నిద్రిస్తున్న శివమ్మను సోమవారం వేకువజామున పాము కాటు వేసింది. తన చేతికి ఏదో కుట్టిందని కుమార్తె పద్మను లేపగా ఆమెకు, అల్లుడు లక్ష్మణ్ చుట్టుపక్కల ఏమి కనిపించలేదు. శివమ్మ నోటి నుంచి నురుగులు రావడంతో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బురద గుంటలో పడి వ్యక్తి..

సిర్పూర్(టి): మద్యం మత్తులో ఇంటికి వెళ్లే దారిలో బురద గుంటలో పడి వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై కమలాకర్ కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని కొత్తకాలనీలో నివాసం ఉంటున్న షేక్ హుస్సేన్ (45) ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. కొన్నేళ్ల క్రితమే భార్యతో విడాకులైంది. కొత్తకాలనీలో తన సోదరి సాబెరా బేగం ఇంట్లో ఉంటున్నాడు. హుస్సేన్ మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం రాత్రి అతిగా మద్యం తాగి ఇంటికి వచ్చి తిరిగి బీడీ తెచ్చుకుంటానని బయటకు వెళ్లాడు. ఇంటికి రాకపోయేసరికి ఎక్కడైన నిద్రపోయాడని సోదరి అనుకుంది. కొత్తకాలనీ ప్రధాన రహదారి నుంచి ఇంటి వెళ్లేదారిలో బురద గుంటలో హుస్సేన్ పడిపోయాడు. సోమవారం ఉదయం కాలనీవాసులు గుర్తించి సోదరికి సమాచారం అందించారు. సాబెరాబేగం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో చికిత్సపొందుతూ ఒకరు మృతి చెందినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా హిరాపూర్ చెందిన ధన్‌లాల్ బావుసింగ్ (46) భార్య ఎనిమిది నెలల క్రితం మృతి చెందింది. మానసికంగా కుంగిపోయిన బావుసింగ్ ఈనెల 7న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు అతన్ని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.